క్లుప్తంగా

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



కార్యక్రమంలో నాయకులు

పరిగి: మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం ఐటా, మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే దేశానికి ఆజాద్ చేసిన సేవలపై వక్తలు మాట్లాడారు. విద్యా అభివృద్ధి ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మోయిజ్‌ఖాన్, జహంగీర్,ముజిబుర్,రహమాన్, సాదత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బొంరాస్‌పేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దుద్యాల మండల పరిధిలోని లగచర్లకు చెందిన బ్యాగరి అమృతమ్మ (45), కుమారుడు రమేశ్‌తో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి శుక్రవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరారు. రేగడిమైలారంలో జాతీయ రహదారి 163పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అమృతమ్మ మృతి చెందినట్లు తెలిపారు.

బీఎంపీ నుంచి రాథోడ్

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బహుజన్ ముక్తి పార్టీ నుంచి రాథోడ్ సూర్యానాయక్ పోటీ చేశారు. బొంరాస్‌పేట మండలం మేడిచెట్టుతండాకు చెందిన సూర్యానాయక్ నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ఏకమైతే రాజ్యాధికారం దక్కించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీతో సంబంధం లేదు

కుల్కచర్ల: గిరిజన విద్యార్థి సంఘానికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొంతమంది సంఘం పేరుతో ప్రచారం చేసుకుంటూ జాతికి ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గణేశ్ నాయక్, అంబర్‌సింగ్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రాంతికుమార్‌కు గురు స్పందన అవార్డు



అవార్డు తీసుకుంటున్న క్రాంతికుమార్

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు క్రాంతికుమార్‌కు గురు స్పందన అవార్డు వరించింది. విద్యారంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా గురు స్పందన పురస్కారం 2023 అందజేశారు. శనివారం ఖమ్మం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ డైరెక్టర్ శామ్యూల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నందుకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం తరలిస్తే కేసు

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర



కొత్లాపూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న నవీన్‌చంద్ర తదితరులు

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అనుమతి లేకుండా మద్యాన్ని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కొత్లాపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే నగదు, మత్తు పదార్థాలు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఎస్ఐ రాములు, సిబ్బంది కిషోర్, మహేశ్, భీమయ్య ఉన్నారు.

'గ్యారంటీ'కి భవిష్యత్తు లేదు

- కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం
- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం
- కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు.. భవిష్యత్తులో ఆరు గ్యారంటీలను అమలు చేస్తారని ఎలా నమ్మాలని పరిగి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. శనివారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని అల్లాపూర్, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్, పటేల్ చెరువు తాండ, దాస్యనాయక్ తాండ, వాల్యానాయక్ తాండ, లింగంపల్లి, అడవివెంకటాపూర్, ఈర్లవాగు తాండ, వితలాపూర్, చౌడాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 55 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. ఇప్పుడు కొత్తగా ఆరు గ్యారంటీ పథకాలంటూ ప్రజల ముందుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, కుల్కచర్ల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, చౌడాపూర్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్‌రెడ్డిని గెలిపించండి

దోమ: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం దోమ మండల పరిధిలోని గంజిపల్లి, గంజిపల్లితండా, బడేంపల్లి, బడేంపల్లి తండాతో పాటు దోమ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని, ప్రజలు ఆ పార్టీలను నమ్మొద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కారు గుర్తుకు ఓటు వేసి మహేశ్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు కావలి లక్ష్మి, మంజుల, బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

పూడూరు: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పరిగి బీఆర్ఎస్ అభ్యర్థి మహేశ్‌రెడ్డి సోదరి అర్చనారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కంకల్, చింతలపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. మహేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ మల్లేశం, నాయకులు ప్రభాకర్‌గుప్తా, సంతోష, వీరన్న, అన్వర్ పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న చిరుత

- బంధించాలని స్థానికుల మొర
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో గ్రామస్తులు



వికారాబాద్ అర్బన్: కొన్ని రోజులుగా వికారాబాద్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చిరుత కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చిరుత సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నెలరోజుల క్రితం పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో చిరుత సంచరించినట్లు అటవీశాఖ ఏర్పాటు చేసిన సీసీ టీవీ పుటేజీల్లో కనిపించింది. అప్పట్లో లేగ దూడను చిరుత వేటాడినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి రైతులు పొలాలకు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు.

రాత్రి అయితే వణుకే

పదిరోజుల క్రితం అనంతగిరి వెళ్లే దారిలో చిరుత రోడ్డు దాటుతుండగా వాహనదారులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. రెండు రోజుల క్రితం వికారాబాద్ మండల పరిధిలోని జైదుపల్లి గ్రామ సమీపంలో మేకను వేటాడింది. శుక్రవారం మండల సమీపంలోని బురంతపల్లి శివారులో, పూడూరు మండల పరిధిలోని గొంగుపల్లి, ఎన్కెపల్లి శివారుల్లో కూడా చిరుత సంచరిస్తున్నట్లు ప్రచారం జరిగింది. అలాగే దామగుండం, అనంతగిరి అడవుల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. పదిరోజుల వ్యవధిలోనే రెండు ప్రాంతాల్లో చిరుత కనపించడంతో.. ఒకటా లేకుంటే రెండా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చిరుత సంచారంతో రాత్రి పూట గ్రామాలకు వెళ్లాలంటనే భయపడిపోతున్నారు. చిరుత కదలికలతో ప్రజలు భయపడుతున్నా.. అటవీశాఖ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అనంతగిరి అడవులకు సమీపంలో గ్రామాలు ఉండడంతో చిరుతలు ఊర్లపై దాడిచేసే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

బంధించండి



ఒంటరిగా పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. రాత్రి పూట పంటకు నీరు పెట్టడానికి పోవాలన్నా భయంగా ఉంది. చిరుత సంచరిస్తున్నట్లు పుకార్లు గుప్పుమంటున్నాయి. వెంటనే బంధించాలి.

– మల్లేశం, మమదాన్ పల్లి గ్రామం

రామ్మోహన్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న ఉమారెడ్డి

పూడూరు: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి ఉమారెడ్డి అభ్యర్థించారు. శనివారం మండల పరిధిలోని గట్టుపల్లి, చింతలపల్లి, మాటుగూడ, నిజాంపేట్‌మేడిపల్లి తదితర గ్రామాల్లో పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగిందని తెలిపారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు. పేదల బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు అజీంపటేల్, పెంటయ్య, శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అందె బాబయ్య గెలుపు ఖాయం

బీజేపీ నేత చెట్ల వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: బీజేపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని నేత చెట్ల వెంకటేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని తొమ్మిదోవ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి అందెబాబయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరివిష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, మురళి, ప్యాట అశోక్, రాము, భూషణ్, కాసోజు శివ, సందీప్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అందెబాబయ్యకు మద్దతుగా ప్రచారం

బీజేపీ అభ్యర్థి అందెబాబయ్యకు మద్దతుగా పట్టణంలోని తొమ్మిదో వార్డులో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య సతీమణి అందెకిష్టమ్మ ఇంటింటికి వెళ్లి భర్తకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ అందెబాబయ్యకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



ప్రచారం చేస్తున్న అందె కిష్టమ్మ

బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులున్నారు.



ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన అన్నపూర్ణ

బీఆర్ఎస్‌లోకి అన్నపూర్ణ

మర్పల్లి: అను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు అన్నపూర్ణ శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఆనంద్ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నపూర్ణ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, మర్పల్లి టౌన్ ప్రెసిడెంట్ గఫార్ తదితరులు ఉన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే



షాబాద్: ఓటు అభ్యర్థిస్తున్న కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత



మొయినాబాద్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేంద్ర మంత్రి బీఎల్ శర్మ

- ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత

షాబాద్: రాష్ట్రంలో రాన్నునది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత అన్నారు. శనివారం నాగర్‌గూడ, ఆస్పల్లిగూడ, చర్లగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో రైతులకు ఎలాంటి లాభం జరగలేదన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక కొందరు తన భర్తపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. చేవెళ్లలో బీజేపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, కార్యకర్తలు, నాయకులు గెలుపు కోసం పని చేయాలని వారు సూచించారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిరణ్, క్యామ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మాణెయ్య, మహేశ్, కూతరు మహేందర్, శ్రీశైలం, నవీన్, గోవర్ధన్, విష్ణు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మొయినాబాద్: చిలుకూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంగలి పెంటయ్య బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. చేవెళ్ల అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బీఎల్ శర్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంగలి పెంటయ్యకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, మండల మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. గెలిపించండి

కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఆ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో తాండూరు నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. పంచాయతీ కార్మికుల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. సమస్య పరిష్కారం కోసం సమ్మె చేస్తే ప్రభుత్వం పట్టించుకోలేదని కార్మికులు మనోహర్‌రెడ్డితో వాపోయారు. పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత డాక్టర్ సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎం.శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ తదితరులున్నారు.

అప్పుడు చేయలేదు.. ఇప్పుడెలా చేస్తారు?

- బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య
- కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాలె యాదయ్య

చేవెళ్ల: ఏళ్ల తరబడి అధికారంలోఉన్న పార్టీలు చేయలేని అభివృద్ధి పనులు ఇప్పుడు ఎలా చేస్తారని బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ప్రశ్నించారు. ఆలూరు, మీర్జాగూడ, బస్తేపూర్ గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్, బీజేపీ ఇచ్చే హామీలను నమ్మొదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. తమకు మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సర్పంచ్ విజయలక్ష్మి, మీర్జాగూడ సర్పంచ్ భీమయ్య, బస్తేపూర్ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ కసిరే వెంకటేశ్, ఎంపీటీసీ యాదమ్మ, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, జెడ్పీటీసీ ఎం. మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార హోరు



తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గిరిజనులు

మోమిన్‌పేట: గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ప్రచార హోరును పెంచారు. పల్లెలు, పట్టణాలను చుట్టేస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి తేల్చిచెప్పారు. శనివారం మండల పరిధిలోని సయ్యద్ అల్లిపూర్ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోతోందని తెలిపారు. నిరుద్యోగులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, సిరాజొద్దీన్, నర్సింలు, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని గెలిపించండి

దౌల్తాబాద్: కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలోనే కొడంగల్‌లో అభివృద్ధి జరిగిందని తెలిపారు. శనివారం మండలంలోని ర్యాలగుట్టతండా, నర్సాపూర్, దౌల్తాబాద్‌పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ సర్పంచ్ హేమలతతో పాటు 5 గురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ర్యాలగుట్టతండాలో గిరిజనులు చేరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, వీరన్న, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.



ప్రచారం చేస్తున్న హన్మంత్‌రెడ్డి

మనోహర్‌రెడ్డి గెలుపు ఖాయం

యాలాల: గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలంటే కాంగ్రెస్ పార్టీ గెలవాలని ఆ పార్టీ బీసీ విభాగం మండల అధ్యక్షుడు అమృతప్ప అన్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నారం, అక్కంపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులతో పాటు పేద, మధ్య తరగతి వారి సంక్షేమం కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. పేదల ఆర్థిక ఎదుగుదలతో పాటు హక్కుల సంరక్షణకు ఆమె ఎంతో కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మాజీ ఎంపీటీసీ రాజు, రఘురాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉప్పరి మొగులప్ప తదితరులు ఉన్నారు.

చిన్నారుల ప్రచారం

ధారూరు: సైకిళ్లకు కాంగ్రెస్ జెండాలను కట్టుకుని ప్రచారం చేస్తూ చిన్నారులు హల్‌చల్ చేశారు. మండల పరిధిలోని గట్టెపల్లి గ్రామ విధుల్లో తిరుగుతూ జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్, చేతి గుర్తుకు మన ఓటు అంటూ నినాదాలు చేశారు. చిన్నారులతో ప్రచారం నిర్వహించడం ఏమిటని గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రస్తుతం ప్రచార ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అభివృద్ధిని విస్మరించిన ఆనంద్

ధారూరు: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నియోజకవర్గంలో అభివృద్ధిని విస్మరించారని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి దుయ్యబట్టారు. ఆనంద్‌ను ఎమ్మెల్యేగా ఓ సారి గెలిపించి ఆగమయ్యామని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ధారూరు మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రకటించారు. ఈ పథకాలతో ప్రతి కుటుంబం సంవత్సరానికి రూ.60వేల వరకు లబ్ధిపొందుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని, బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టుకు సందర్శకులు రాకుండా ఆనంద్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రచారంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, మాజీ జెడ్పీటీసీ రాములు, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్, ఇబ్రహీం, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కుల్కచర్ల: పేదల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి స్వామి, రాంలాల్, కృష్ణయ్య, యాదయ్య, భాస్కర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- చేవెళ్ల అసెంబ్లీ బీఎస్‌పీ అభ్యర్థి రాజమహేంద్రవర్మ

మొయినాబాద్‌రూరల్: ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చేవెళ్ల బీఎస్‌పీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజమహేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో బీఎస్‌పీ నాయకులు, మండల ఉపాధ్యక్షుడు విక్రమ్‌రాయ్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవర్మ మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించాలన్నారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారంలో వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరసింహయాదవ్, మండల కార్యదర్శి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.